క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు



వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ రామ్మూర్తి

పెద్దకడబూరు : స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో నాలుగు రోజులుగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీలకు జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. శిక్షణా తరగతులను పరిశీలించిన ఎంఈఓ రామ్మూర్తి మాట్లాడుతూ మండలంలోని 43 పాఠశాలల వంట ఏజెన్సీల సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. రోజుకు 10 పాఠశాలల ఏజెన్సీలకు చొప్పున మొత్తం నాలుగు రోజుల పాటు శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. ఇకపై పాఠశాలల్లో వంట ఏజెన్సీలు శిక్షణ తరగతుల్లో ఇచ్చిన శిక్షణ మేరకు విద్యార్థులకు మంచి భోజనాన్ని అందించాలని సూచించారు. కస్తూర్బా ప్రత్యేకాధికారి రుక్సానా పర్వీన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

కోసిగి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో మండల స్థాయి పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకు కూరగాయాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు విజయకుమారి, నాగలక్ష్మీ, క్యాతాయని, ఎంపీహెచ్ఓ శ్రీనివాసులు, అదాని ఫౌండేషన్ ప్రతినిధి విజయ్ కుమార్, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.
నందవరం: పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తకైరవాడిలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం కిట్లను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఉమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు శమంతకమణి, పద్మరాగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



మృతుడు చంద్ర

నందవరం: మద్యానికి బానిసై ఓ వ్యక్తి గురువారం పురుగు మందును మద్యంలో కలుపుకుని తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాత పడ్డాడు. వివరాలు.. నందవరం మండల కేంద్రానికి చెందిన కుమ్మరి చంద్ర (53) మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఇంటిల్లిపాది పొలం పనులకు వెళ్లారు. ఎవరూ లేని సమయంలో స్టార్‌తీన్ మందును మద్యంలో కలుపని తాగాడు. పొలం పనులకు వెళ్లి వచ్చిన కొడుకులు అపస్మారక స్థితిలో ఉన్న చంద్రను ఎమ్మిగనూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు స్రవంతి

నందవరం: మండలంలోని నందవరం గ్రామానికి చెందిన వివాహిత మతిస్థిమితం లేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నందవరానికి చెందిన కురువ భీరప్ప కూతురు స్రవంతి (24) కోసిగి మండలం సజ్జలగుడ్డం గ్రామానికి చెందిన రామకృష్ణతో వివాహం జరిగింది. దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నేళ్లుగా ఆమెకు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో పుట్టింటిలోనే ఉంటోంది. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా గురువారం ఉదయం ఇంటిలో ఉరి వేసుకుంది. తాత పెద్ద నాగన్న గమనించి ఆమెను కిందకు దించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు చేయూతనిద్దాం

ఎమ్మిగనూరుటౌన్: వరద బాధితులకు ఉదారంగా చేయూతనందించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. ఇందుకు తన వంతుగా ఏడాది గౌరవ వేతనం రూ.60 వేలు విరాళంగా ఇస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్ పేర్కొన్నారు. కౌన్సిలర్లంతా నెల లేదా రెండు నెలల వేతనాన్ని వరద బాధితులకు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు రావాలని కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన జరిగింది. పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కమిషనర్ గంగిరెడ్డి, డీఈలు నీరజ, విక్టర్, టీపీఓ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నిధులు కరువై.. చాక్‌పీస్ బరువై

- విడుదలవ్వని పాఠశాల నిర్వహణ గ్రాంటు
- చాక్‌పీస్, డస్టర్, రిపేర్లకూ ఇబ్బందులే
- ప్రధానోపాధ్యాయులే భరించాల్సిన పరిస్థితి



పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సామగ్రి కనుగోలు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహణ గ్రాంటు విడుదల చేస్తుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా పాఠశాలలకు నిర్వహణ గ్రాంటు విడుదల చేయలేదు. దీంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే చాక్‌పీస్, డస్టర్, మైనర్ రిపేర్లకు జేబులో నుంచి డబ్బులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుందో లేదోనని హెచ్ఎంలు అయోమయంలో పడ్డారు.

నియోజకవర్గంలో 130 పాఠశాలలు

ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, గురుకుల పాఠశాలలు 130 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 31,000 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్ల అవసరాల నిమిత్తం ప్రతి ఏటా నిర్వహణ నిధులను మంజూరు చేస్తుంది. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య అధారంగా నిధులు విడుదలవుతాయి. ఆ నిధులతో తరగతి గదుల్లో అవసరమైన చాక్ పీస్, డస్టర్, ఎవైనా మైనర్ రిపేర్లు ఉంటే వాటి కోసం ఉపయోగిస్తారు. అయితే కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ నిధులను విస్మరించింది. దీంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఆయా ఖర్చుల నిమిత్తం చేతినుంచి భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా మంది హెచ్ఎంలు చేతినుంచి ఖర్చు పెట్టి ప్రభుత్వం నిధులను ఎప్పుడు విడుదల చేస్తుందోనని ఎదురు చుస్తున్నారు.

విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు

పాఠశాలల్లో 20లోపు విద్యార్థులు చదవుతుంటే రూ. 10 వేలు, 21 నుంచి 49లోపు విద్యార్థులు చదువుతుంటే రూ. 15వేలు, 50 నుంచి 100లోపు రూ. 20వేలు, 101 నుంచి 250 లోపు రూ. 50వేలు, 251 నుంచి 1000 లోపు రూ. 75వేలు, 1000పైన విద్యార్థులు చదువుతుంటే రూ.లక్ష దాకా నిధులను విడుదల చేస్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలల నిర్వహణ గ్రాంటుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో నిధులను మంజూరు చేసే వారు. పాఠశాలల్లో అవసరమైన ప్రతి వస్తువు కనుగోలు చేసేందుకు నిధులను కేటాయించే వారు. పాఠశాలల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకునేది.

ఎంతగానో ఉపయోగపడుతుంది



పాఠశాల నిర్వహణ గ్రాంటు ఇంతవరకూ విడుదల కాలేదు. చాక్‌పీస్‌లు, డస్టర్లు, మైనర్ రిపేర్లు వంటి వాటికి చేతి నుంచి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ఈ విషయం అధికారులు దృష్టికి కూడా తీసుకెళ్లాం. త్వరలో నిధులు విడుదల అవుతాయని చెబుతున్నారు. నిధులు విడుదలైతే పాఠశాలకు అవసరమైన వాటిని కనుగోలుతో పాటు మైనర్ రిపేర్లు వంటి వాటికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

– మల్లికార్జున, హెచ్ఎం, పురపాలక ఉన్నత పాఠశాల

గ్రాంట్ కోసం ఎదురుచూపులు

పాఠశాలల నిర్వహణ గ్రాంటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. గతంలో అమ్మ ఒడి పథకం నుంచి కొంత మినహాయించి నిధులను అందజేసేవారు. ప్రస్తుతం తల్లికివందనం ఈ ఏడాది ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. ఒక వేళ ఇవ్వక పోతే ఇక నిర్వహణ గ్రాంటు పరిస్థితి ఎంటోనని పలువురు పేర్కొంటున్నారు. నిధులు మంజూరు కాకపోతే రానున్న రోజుల్లో పాఠశాలల నిర్వహణ కష్టతరమవుతుందని వాపోతున్నారు.

29న ప్లాటినం జూబ్లీ వేడుకలు

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 29వ తేదీ ఎమ్మిగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల ఆత్మీయ మహా సమ్మేళనం (ప్లాటినం జూబ్లీ) వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆడిటోరియంలో మాట్లాడారు. 1948లో పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ, ప్రస్తుత విద్యార్థులతో ఈనెల 29వ తేదీ మహా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. కమిటీ సభ్యులు షఫివుల్లా, హరినారాయణ రెడ్డి, మాచాని శివకుమార్, వెంకటేష్, ప్రకాష్ జైన్, ఈరన్న గౌడ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

23లోపు ఈ-కేవైసీని పూర్తిచేసుకోండి

కౌతాళం: రైతులు ఈ-కేవైసీని ఈనెల 23వ తేదీ లోపు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి కోరారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఈ- కేవైసీని పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో పంటల నమోదు కార్యక్రమం పూర్తయ్యిందని, వాటికి సంబంధించిన ఈ- కేవైసీకి మూడు రోజుల గడువు ఉందన్నారు. రైతులందరూ రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తప్పనిసరిగా ఈ-కేవైసీని చేయించుకోవాలని చెప్పారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

- ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్



మొక్కలు నాటి నీరు పోస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఆరేకల్-కోటేకల్ గ్రామాల సమీపంలోని నగరవనంలో అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సబ్‌కలెక్టర్ అమ్మ పేరుతో మొక్కను నాటాలని పిలుపునిస్తూ మొక్క నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పర్యావరణాన్ని కాపాడాలన్నారు. మొక్కలు పెద్దవైతే సకాలంలో వర్షాలు కురుస్తాయని, పాడి పంటలు బాగా పండుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఆదోని రేంజ్‌ఆఫీసర్ తేజస్వి, తహసీల్దార్ శేషఫణి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామచంద్ర, బీట్ ఆఫీసర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ గురించి తెలుసుకోవాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ గురించి తెలుసుకోవాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆదోని పట్టణంలోని సాయి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు విద్యార్థులు బైకులు నడపరాదన్నారు. అతివేగంగా బైకు రేసింగ్, ట్రిబుల్ రైడింగ్ చేయకూడదన్నారు. మైనర్‌లు బైకులు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా విద్యార్థులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడరాదని సూచించారు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు.

ఆన్‌లైన్ కేంద్రం.. సేవలు శూన్యం



నిరుపయోగంగా ఉన్న దిగుబడుల ఆన్‌లైన్ నమోదు కేంద్రం

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులకు సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల దిగుబడులను ఆన్‌లైన్‌లో ఎక్కించే కేంద్రాన్ని యార్డులో నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. అయితే దానిని మనుగడలో పెట్టడం మరిచిపోయారని విమర్శిస్తున్నారు. గత పదిరోజులుగా రైతులు వేల క్వింటాళ్ల పత్తి, వేరుశనగ కాయలు అమ్మకానికి యార్డుకు తీసుకొస్తున్నారు. వారి దిగుబడులను టెండర్‌కు విక్రయానికి పెట్టేందుకు ఆన్‌లైన్‌లో ఎక్కించాల్సి ఉంటుంది. అయితే ఆన్‌లైన్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురాకపోవడంతో రైతులు కార్యాలయానికి వెళ్లి దిగుబడులను నమోదు చేసుకోవాల్సి వస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురికావడమే కాకుండా సమయం కూడా వృథా అవుతోంది. ఆలస్యమైతే రైతు దిగుబడులను టెండర్‌కు పెట్టే అవకాశం ఉండదు. అధికారులు స్పందించి ఆన్‌లైన్ కేంద్రాన్ని మనుగడలో పెట్టేలా చర్యలు తీసుకొని రైతులకు మేలు చేయాలని ఏజెంట్లు కోరుతున్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: వైద్య విద్యను చదువుకోవాలనే పేద విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, మహేంద్ర బాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పట్టణంలోని నారాయణ కళాశాల నుంచి జిమ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రానికి 17 కొత్త కళాశాలలను తీసుకొచ్చి గతేడాది 5 కళాశాలలను ప్రారంభించిందని గుర్తు చేశారు. ఈ ఏడాది ప్రారంభం కావాల్సిన ఐదు కళాశాలల పనులను కూటమి ప్రభుత్వం నిలిపి వేయడమే కాకుండా సీట్లను కూడా రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అని వారు ఖండించారు. ప్రారంభమైన కళాశాలల పనులను పబ్లిక్ ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ విధానంలో నిర్మిస్తామని చెప్పడం దారుణమన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన మన రాష్ట్రానికి రావాల్సిన 700 వైద్య సీట్లను కోల్పోయామన్నారు. పులివెందుల కళాశాలకు ఇస్తున్న 50 సీట్లను వద్దని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. అంటే పేద, మధ్య తరగతి విద్యార్థులు డాక్టర్లు కాకూడదా అంటూ కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీని విస్మరించిందన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేసి ఉంటే ఈ సంవత్సరం కన్వీనర్ కోటాలో అదనంగా 300 ఎంబీబీఎస్ సీట్లు వచ్చేవి అని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి వైద్య విద్య, ఆసుపత్రుల ప్రైవేటీకరణను విరమించుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమములో నాయకులు మహేష్, రవి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో బదినేహాల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

కౌతాళం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 బాల, బాలికలకు మండలస్థాయి క్రీడా పోటీల్లో బదినేహాల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావు, వ్యాయమ ఉపాధ్యాయుడు నరసింహరాజు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈనెల 18,19వ తేదీల్లో జరిగిన అండర్-14, 17 ఖోఖో పోటీల్లో బాలకలు విన్నర్‌గా నిలిచారన్నారు. అలాగే కబడ్డీ అండర్-14లో పోటీల్లో బాలికలు గెలుపొందారు. అండర్-17 బాలురు కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు వివరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

జాబ్ మేళాలో 62 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో అధ్యాపకులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 62 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, నవ భారత్ ఫర్టిలైజర్స్, క్రెడిట్ ఆక్సిస్ గ్రామీన్ లిమిటెడ్ తదితర కంపెనీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయి తేజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన మహిళ మృతి



కురవ రామలక్ష్మి(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పాము కాటుకు గురైన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. వివరాలు.. మండల పరిధిలోని బనవాసి గ్రామానికి చెందిన కురవ మల్లికార్జున భార్య కురువ రామలక్ష్మీ(29) ఈ నెల 14వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. ఏదో కరిచినట్లు ఉందని భర్తకు చెప్పడంతో లేచి చూశాడు. పాము వెళుతుండగా చూసి చంపేందుకు ప్రయత్నించగా తప్పించుకుపోయింది. ఏం కాదులే అని నిద్రించారు. ఉదయం అస్వస్థతకు గురికావడంతో ఎమ్మిగనూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పాము విషం శరీరం మొత్తం వ్యాపించిందని వైద్యులు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్‌పీవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాజా

ఎమ్మిగనూరుటౌన్: బీఈడీ విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించాలని ఆర్‌పీవీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజ, కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాయలసీమ యూనివర్సిటీ అధికారులు బీఈడీ విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికెషన్ ఇచ్చినందున కొన్ని సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని కోరారు. తద్వారా డీఎస్సీకి అర్హత సాధించి డీఎస్సీ కోసం సిద్ధమవుతారని తెలిపారు. సంఘం నాయకులు శేషు, మోహన్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థుల కష్టాలను తీర్చాలని బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు నరసన్న యాదవ్, డీఎస్‌వైఏ నాయకుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. బకాయిలను సత్వరం విడుదల చేయకుంటే దశల వారిగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు రాముడు, హరి, శ్రీను, నడవలయ్య, మలకన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎమ్మిగనూరుటౌన్: కర్నూలులో గురువారం జరిగిన జిల్లా షూటింగ్ బాల్ పోటీల్లో ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఇందు, సునీత రెండో స్థానంలో నిలిచారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ విజయ రాణి శుక్రవారం తెలిపారు. విద్యార్థులను అభినందించారు. అధ్యాపకులు లక్ష్మి, స్రవంతి, గాంగావతి, పద్మావతి, కావ్యశ్రీ, హరికుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

25న ఉచిత రక్తనాళాల వైద్య పరీక్ష శిబిరం

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని పూల బజార్ వాసవీ కళ్యాణ మండపంలో ఈనెల 25న ఉచిత రక్తనాళాల వైద్య పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు అవోపా పట్టణ అధ్యక్షుడు, భారత సేవా రత్న అవార్డు గ్రహీత వంకదారు శ్రీనాథ్ గుప్త తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వైట్ హౌస్‌లో వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), ఆమ్ ఆధ్వర్యంలో వాస్కులర్ ఆస్పత్రి, ఎస్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ సహకారంతో ఉచిత రక్తనాళాల పరీక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్త కణాల లక్షణాలకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా చికిత్సలు అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదోని పట్టణ అవోపా, వామ్ కార్యదర్శులు డైమండ్ రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు వెంకటేష్‌బాబు, అంజి, విజయ్, రత్నయ్య, మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమత, గీత పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ఆదోని టౌన్: ప్రజల సమస్యలు పరిష్కరించంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రమేష్‌యాదవ్ విమర్శించారు. ఆదోని నియోజకవర్గంలో రోడ్లు గుంతలుపడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారయంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం గుంతల పూడ్చించే కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. గుంతలపై మట్టి వేసి పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు అధ్వానంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క రోడ్డు కూడా ఇంతవరకు మరమ్మతులు చేసినా పాపాన పోలేదని వాపోయారు. కూటమి ప్రభుత్వంలో కుమ్ములాటలే తప్పా అభివృద్ధి కనిపించడంలేదని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంవహిస్తే ప్రజల తరపున నిలబడి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

కోసిగి: రాష్ట్రంలో 25వేలకు పైగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సాతనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా పాఠశాలల్లో సబ్జెక్టుల టీచర్లు లేక బోధన అందక విద్యార్థులు సతమతమవుతున్నారన్నారు. నోటిఫికేషన్ పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కార్యదర్శి అంజి, హనుమంతు, ఆనంద్, నరసింహులు, రమేష్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

పెద్దకడబూరు : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం సిద్ధిస్తుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ భవనం, ప్రాథమిక(మెయిన్) పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనతంర ఆవరణలో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. వైస్ సర్పంచ్ విజయేంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ముక్కరన్న, అర్లప్ప, బ్రహ్మయ్య, సుందరం, ప్రసాద్, అనిల్ పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ పేర్కొన్నారు .శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో అనేక అనర్థాలు

ఎమ్మిగనూరుటౌన్: ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలే ఎక్కువ అని స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి, మెప్మా సీఎంఎం జయవర్ధన్ అన్నారు. స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థినులకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కౌతాళంలో మండలస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

కౌతాళం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. కౌతాళంతో పాటు మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానుయేల్ తెలిపారు. జావింగ్‌త్రో, షాట్‌పుట్, లాంగ్‌జంప్‌తో పాటు రన్నింగ్ రేస్‌లో 100,200,400,600,800 మీటర్ల పోటీలు నిర్వహించి ప్రతి క్రీడా పోటీలో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు.

మహిళలపై దాడులను అరికట్టడంలో విఫలం



మహిళను పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: మహిళలపై దాడులను అరికట్టడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఐద్వా జిల్లా నాయకురాలు పీఎస్ సుజాత ఆరోపించారు. పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత గోవిందమ్మ ఓ సామాజిక వర్గం చేతిలో దాడికి గురై స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆమెను శుక్రవారం ఐద్వా నాయకులు పరామర్శించారు. ప్రభుత్వాల వైఫల్యాల వల్ల చిన్నారుల నుంచి మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయన్నారు.